రోడ్డు వివాదాన్ని పరిష్కరిస్తా

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న భెల్ ఎంఐజీ కాలనీ వాసులు

శేరిలింగంపల్లి: రోడ్డు వివాదాన్ని భెల్ యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఐజీ కాలనీ వాసులకు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్‌తో కలిసి శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీలో ఆయన పర్యటించారు. భెల్ ఎంఐజీ, భెల్ సంస్థ నడుమ ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించేలా సదరు యాజమాన్యంతో చర్చిస్తానని తెలిపారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నేతల నివాళి



చందానగర్: మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి శుక్రవారం రాత్రి నగరంలో తుది శ్వాస విడిచారు. ఈ సందర్భంగా శనివారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో వృద్ధాశ్రమంలో ఆయన చిత్రపటానికి సీఆర్ ఫౌండేషన్ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఏబీకే ప్రసాద్, ట్రెజరర్ చెన్నకేశరావు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య స్వరార్చన



మాదాపూర్: కళాకారులు స్వరార్చన కార్యక్రమంలో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా మోహన మురళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ బృందం స్వరార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారులను సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్, వ్యవస్థాపకులు డాక్టర్ శోభరాజులు సత్కరించారు.

ఆకట్టుకుంటున్న చిత్రాలు





మాదాపూర్: కళాకరుడు కట్టకూరి రవి వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రామయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. కళాకారుడు కట్టకూరి రవి వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు, నిర్వాహకులు తెలిపారు.

మైమరిపించిన నృత్యరూపకం




మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సంగీత నృత్య కథనంతో శ్రీకృష్ణలీల అనుభవం భాగవత కథలతో సంగీత నృత్ కథను ప్రదర్శించారు. సాయికృష్ణ డ్యాన్స్ అకాడమీ గురువు ఉదయశ్రీ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చింది.

25న 'నిథమ్'లో రక్తదాన శిబిరం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ సోషల్ సర్వీస్ వింగ్ సహకారంతో గచ్చిబౌలిలోని 'నిథమ్' క్యాంపస్‌లో సోమవారం జాతీయ స్థాయి రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుంది. ఔత్సాహిక యువతీయువకులు రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకురావాలని నిర్వాహకులు కోరారు.

చవితి సందడి షురూ..!

- మండపాలకు ఏర్పాట్లు చేస్తున్న కమిటీ సభ్యులు
- వినాయక విగ్రహాలు మార్కెట్లో సిద్ధం



వినాయక విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు

మియాపూర్: వినాయక చవితి సందడి మొదలైంది. ఊరు, వాడ జై గణేశా.. అంటూ విఘ్నేశ్వరుడికి ఘనస్వాగతం పలుకుతున్నారు. ఇలా తొమ్మిది రోజుల పాటు లంబోదరుడికి పూజలు చేసి తరిస్తారు. ఆగస్టు 27న వినాయక చవితికి అందరూ సిద్ధమవుతున్నారు. కాలనీ, బస్తీ తేడా లేకుండా అన్ని వీధుల్లో గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించడానికి సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే వాడల్లో, వీధుల్లో భారీ గణేష్ మండపాలను ఏర్పాట్లను ప్రారంభించారు. వినాయక మండపాలను ప్రత్యేక డిజైన్లలో ఆకర్షణీయంగా రూపొందిస్తున్నారు. వినాయక విగ్రహాలను కూడా కళాకారులు వివిధ రూపాల్లో ఆకర్షణీయంగా తీర్చిదిద్ది అమ్మకానికి ఉంచారు. మియాపూర్‌లో విగ్రహాలకు కళాకారులు తుదిమెరుగులు దిద్ది అమ్మకానికి రెడీగా ఉంచారు. ఉత్సవ కమిటీలు గణేష్ విగ్రహాలను ముందుగానే బుక్ చేసుకోగా మరికొందరు భారీ విగ్రహాలను మండపాల వద్దకు తరలిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ పోలీసులు, జలమండలి, విద్యుత్ శాఖ, ట్రాఫిక్ అధికారులు పండుగ ఏర్పాట్లు బందోబస్తు గణేష్ మండప ప్రతినిధులతో, కమిటీలతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించారు.

- విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు నిబంధనల మేరకు నడుచుకోవాలని పోలీస్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు మొదలు, నిర్మాణానికి అనుమతి, నిమజ్జనం ఇలా ప్రతిదానికి చట్టపరమైన అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. మండప ఏర్పాటు, విగ్రహ ప్రతిష్ఠాపనకు అనుమతి లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించేవారు ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసుకుని పోలీస్ శాఖనుండి అనుమతి తీసుకోవాలి. తప్పని సరిగా మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. చుట్టుపక్కల అనుమానితులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అగ్నిమాపక పరికరాలను మండపాల వద్ద ఉంచుకోవాలి.

– శివ ప్రసాద్, మియాపూర్ ఇన్‌స్పెక్టర్





రక్తదానం.. అన్ని దానాల కన్నా గొప్పది



రక్తదాన శిబిరం ప్రారంభంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: రక్తదానం అన్ని దానాలలో గొప్పదని సిటిజన్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మరం శ్రీధర్ పేర్కొన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో విస్టా ఇంటర్నేషనల్ స్కూల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒకేసారి బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాలను పెద్ద ఎత్తున చేపట్టడం హర్షణీయమన్నారు. ప్రతి ఆరోగ్య వంతుడు రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకురావాలని ఆయన సూచించారు. అనంతరం విస్టా ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ శాంతిప్రియా, బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి బికె ఉషశ్రీ, తెల్లాపూర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రమణీఈశ్వరగారి రక్తదానం ప్రాధాన్యతను వివరించారు.

అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించుకోవాలి

రాయదుర్గం: వైద్యులు గ్లోబల్ నాలెడ్జితో శక్తివంతం అవుతారని మెడికవర్ ఆస్పత్రుల డైరెక్టర్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీ లోని టీహబ్‌లో 'ఎలివేట్ ఈఎన్‌టీ సమ్మిట్–2025' రెండవ ఎడిషన్‌ను శనివారం నిర్వహించారు. వైద్యులు అంతర్జాతీయ స్థాయి సామర్థ్యంతో చికిత్సలు అందించి శక్తివంతులైతే రోగులకు మరింత సురక్షితమైన, ప్రభావవంతమైన చికిత్స అందుతుందన్నారు. కొత్త పద్ధతులను నేర్చుకోవడం, అత్యాధునిక శస్త్ర చికిత్సా సాంకేతికతలను అవలంబించడం ద్వారా ఈఎన్‌టీ సర్జన్లు మరింత ఖచ్చితమైన వైద్యం అందించవచ్చన్నారు. మెడికవర్ ఆస్పత్రు కన్సల్టెంట్స్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ సంపూర్ణా ఘోష్ పాల్గొన్నారు.

వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం



ఎమ్మెల్యేను కలిసిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

రాయదుర్గం: టీఎన్‌జీఓకాలనీలో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని టీఎన్‌జీఓకాలనీ రంగారెడ్డి కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని, అందుకు పూర్తిగా సహకరిస్తామన్నారు. కాలనీ అసోసియేషన్ భాగస్వామ్యంతో అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకుంటామన్నారు. నాయకులు సత్యనారాయణ, కాలనీ అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాల సంరక్షణే లక్ష్యం

విద్యుత్ శాఖ సీజీఎం పాండ్యా నాయక్



అలకాపూర్ టౌన్‌షిప్‌లో కేబుల్ వైర్ల తొలగింపు పనులను పరిశీలించిన అధికారులు

మణికొండ: విద్యుత్ స్తంభాలకు కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లను కుప్పలుగా కట్టటంతో ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోతున్నాయని, వాటిని నివారించేందుకే తొలగిస్తున్నామని విద్యాశాఖ చీఫ్ జనరల్ మేనేజర్(ఆర్‌ఆర్‌జోన్) అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లో శనివారం విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లను తొలగించే పనులను విద్యుత్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యుత్ స్తంభాలకు క్వింటాళ్ల కొద్దీ వైర్లను వేలాడ దీయటంతో స్తంభాలు వంగిపోతున్నాయన్నారు. నిబంధనల ప్రకారం వారు వేరుగా స్తంభాలు ఏర్పాటు చేసుకోవటం, భూగర్భంలో కేబుల్‌ను ఏర్పాటు చేసుకుని వారి సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. అందుకు భిన్నంగా ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలను వాడుకుంటున్నారన్నారు. రాబోయే గణేశ్ నవరాత్రులు, విగ్రహ నిమజ్జనాల సమయంలో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ సీఎండీ ఆదేశాలతో హైదరాబాద్ వ్యాప్తంగా కేబుళ్ల తొలగింపు పనులను కొనసాగిస్తున్నామన్నారు. సైబర్‌సిటీ ఇంచార్జి ఎస్ఈ రాంబాబు, ఇబ్రహీంబాగ్ డీఈ రమేష్‌చంద్ర, ఏడీఈ అంబేడ్కర్, ఏఈ సంతోష్‌కుమార్, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అర్వపల్లి వంశీ, కార్యవర్గ సభ్యులు డాక్టర్ అవినాష్, బాబురావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో హెచ్‌ఎండబ్ల్యూఎస్ శాఖ మేనేజర్ అరుణ్, ఎస్ఎఫ్ఏ గోవిందలతో కలసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా జేపీకాలనీ, అంబేద్కర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. దీంతో కార్పొరేటర్ పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి పూడికతీత పనులు ఎప్పటికప్పుడు తొలగించాలని, కాలనీవాసులకు ఇబ్బంది రాకుండా చూడాలని ఆదేశించారు.

భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 243లోని ప్రభుత్వ భూముల కబ్జాను రెవెన్యూ యంత్రాంగం అడ్డుకుంది. ఈ మేరకు శనివారం తహసీల్దార్ దేవదాస్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ 29 గుంటల ప్రభుత్వ భూమిలో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చూస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. ఈ భూముల్లో కొనుగోలు, అమ్మకాలు జరిపితే క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

మున్సిపల్ కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం

పటాన్‌చెరు టౌన్: మున్సిపల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తూ వారిని పూర్తిగా విస్మరిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఆరోపించారు. పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్‌భవన్‌లో శనివారం జరిగిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఐదవ జిల్లా మహాసభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు పని గంటలు తగ్గించకపోవడం వల్ల పని భారం పడుతుందన్నారు. ఒకవైపు పని భారం పడుతున్నా వేతనాలను పెంచడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ ఇతర చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని లేని పక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, కోశాధికారి కె.రాజయ్య, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి గాయాలు

జిన్నారం (పటాన్‌చెరు): పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన గడ్డపోతారం పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... ఎన్ మాక్స్ పరిశ్రమలో పనిచేసే సుధాకర్ విధులు నిర్వహిస్తుండగా క్రేన్ వెనుక నుంచి ఢీకొట్టడంతో కాలు విరిగి ప్రాణాలతో బయటపడ్డాడు. గాయాలైన కార్మికుడిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

దేవాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మాణిక్యమ్మ కాలనీ పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో రోజు విడిచి రోజు రోడ్లను శుభ్రపరిచే వారిని ప్రస్తుతం నెల రోజులుగా పారిశుద్ధ్య పనులను నిర్వహించడం లేదని వెల్లడిస్తున్నారు. దీంతో రోడ్లపై చెత్తాచెదారాలు పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వినాయక నవ రాత్రి ఉత్సవాల నేపథ్యంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించాలని కోరుతున్నారు.

టేస్టీ ఫుడ్..

శిక్షణ పొందారు....
నోరూరించే ఆహారపదార్థాలు చేశారు





రాయదుర్గం: స్వయం సహాయ సంఘాలకు చెందిన మహిళలకు చెందిన 33 మంది మహిళలకు గచ్చిబౌలిలోని నిథమ్‌లో ప్రత్యేక శిక్షణ అందించి బేకరీ, ఇతర ఆహారపదార్థాల తయారీపై చెఫ్‌లు ప్రత్యేక శిక్షణ అందించారు. అనంతరం ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించగా పాల్గొని తామే స్వయంగా అన్ని ఆహార పదార్థాలను స్వయంగా తయారు చేసి అందరికీ రుచి చూపించి అందరి మన్ననలు పొందారు. నిథమ్ చెఫ్‌లు మహేష్, తుల్జారామ్ పర్యవేక్షణలో బేకరీ ఆహార పదార్థాలలో పైనాపిల్ పేస్ట్రీ, చాక్లెట్ కుకీలు, బర్గర్ బన్, బ్లాక్ ఫారెస్ట్, ఉస్మానియా బిస్కెట్లు, పిజ్జా, బటర్‌స్కాచ్,కేక్, మఫిన్స్, ఎగ్ పఫ్, వంటివాటి ని తయారు చేయడంపై ప్రత్యేక శిక్షణ పొందారు. అనంతరం చివరిరోజు వాటినే తాము స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు. వీటిని నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్, ఎస్ఈఆర్‌పీ హైదరాబాద్ డీపీఎం హమీద్, జేడీఎం శారద, ఏపీఎం మాధవి, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మిచెల్లీ జే ఫ్రాన్సిస్‌లు పరిశీలించి మహిళలను ప్రశంసించారు.

ఫిన్‌టెక్ రంగంలో నూతన ఆవిష్కరణలు



సదస్సు ప్రారంభ వేడుకలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: ఫిన్‌టెక్ రంగంలో నూతన ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్ళగల సామర్థ్యం అవసరమని ఇమార్టికస్ లెర్నింగ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆహ్మద్‌ఖలీద్ అభిప్రాయపడ్డారు. కొండాపూర్‌లోని కెఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధికి డిస్రప్టివ్ ఇన్నోవేషన్ పేరిట ప్రత్యేక సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్‌తో కలిసి ఈ సదస్సును నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ పంచుకున్న చర్చలు, ఆలోచనలు, అకాడెమియా– ఇండస్ట్రీ కలిసి టాలెంట్‌ను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేఎల్ యూనివర్శిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్‌హవీష్ మాట్లాడుతూ మా విద్యార్థులను డిజిటల్ ఎకానమీకి సిద్ధం చేసే భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు.

మల్కంచెరువుపార్కులో వాకర్స్‌ను అనుమతించాలి



జోనల్ కమిషనర్ హేమంత్‌సహదేవరావుకు వినతిపత్రం అందిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

రాయదుర్గం: మల్కం చెరువుపార్కులోని వాకింగ్ ట్రాక్‌పై వాకర్స్‌కు అనుమతించడం లేదని వెంటనే అనుమతించేందుకు చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరారు. శనివారం వాకర్స్ ప్రతినిధులు జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రతి ఏడాది గణేష్ నిమజ్జనాల కారణంగా 15 రోజుల పాటు వాకర్స్‌కు అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాకర్స్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి మార్నింగ్ వాకర్స్‌ను అనుమతించేందుకు చర్యలు చేపట్టాలని ఆయనను వారు కోరారు. ఇందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వాకర్స్ తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ప్రబాకర్‌బాబు, నిర్మాత మల్లికార్జున్ పాల్గొన్నారు.

రైస్ మిల్లింగ్ రంగంలో ఆధునిక టెక్నాలజీ



ప్యాడీ, రైస్ మిల్లింగ్ టెక్నాలజీని ఆవిష్కరిస్తున్న అతిథులు

'ప్యాడీ, రైస్ మిల్లింగ్ టెక్నాలజీ' ఆవిష్కరణ

రాయదుర్గం: వరి, బియ్యం రైస్ మిల్లింగ్ సాంకేతికతలో రూపొందించిన యంత్రాన్ని ఆవిష్కరించారు. శనివారం రాత్రి రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో దక్షిణ భారత రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంపానాగేంద్ర సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడ్ ఇన్ ఇండియాకు నిదర్శనంగా ఈ నూతన సాంకేతికత నిలుస్తుంద న్నారు. రైస్ మిల్లింగ్ రంగంలో ఈ నూతన టెక్నాలజీ విప్లవాత్మకమైందన్నారు. దీని ద్వారా మిల్లర్స్‌కు ఎంతో చేయూత అందించినట్లవుతుందన్నారు. సీఈఓ మేనేజింగ్ డైరెక్టర్ శశికుమార్ తిమ్మయ్య పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి 'అరబిందో' చేయూత



చెక్కును అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధి

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని అలీనగర్ గ్రామ అభివృద్ధికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షలను మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి ఆధ్వర్యంలో గ్రామస్తులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి పరిశ్రమ సహకారం ప్రశంసనీయమన్నారు. రెండు లక్షల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు వీరేశంగౌడ్, స్థానిక నాయకులు బాలయ్య, వేణు, పెంటేశ్, కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

- వివిధ శాఖల అధికారులతో సమీక్ష
- పటిష్ట ఏర్పాటు చేయాలి
- అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి
- బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర
- వివిధ అంశాలపై అధికారులతో చర్చించిన కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ బి.శరత్‌చంద్ర సమక్షంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ, విద్యుత్, దేవాదాయ, రెవెన్యూ, పోలీసు, ట్రాఫిక్ పోలీసులు, నీటిపారుదల శాఖ అధికారులతో గణేశ్ నవరాత్రుల ఏర్పాట్లు, నిర్వహణపై సమీక్షించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు, కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్ద నిమజ్జన ఏర్పాట్లుపై చర్చించారు. మున్సిపల్ అధికారులతో 100 రోజుల కార్యచరణ ప్రణాళిక, ఇందిరమ్మ ఇళ్లు, రీవెరిఫికేషన్ నూతన రేషన్ కార్డుల ఎంక్వైరీ, తుపానుల అత్యవసర బృందం (మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్) కార్యచరణ ప్రణాళిక వివిధ వార్డులలో పారిశుద్ధ్య పనులు నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్, జనన, మరణ ధ్రువీకరణ ప్రతాల జారీ, భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు విడుదల, అక్రమ నిర్మాణాలపై చర్యలు, వాణిజ్య ప్రకటనల పన్నుల వసూలు, కోర్టు కేసులు, నూతన సంఘాల ఏర్పాటు, వివిధ లక్ష్యాల సాధన, స్ట్రీట్ వెండర్స్ జోన్స్ విధానం, భువన్ జీయో ట్యాగ్గింగ్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్స్, అన్–అస్సెస్డ్, అండర్ అస్సెస్డ్ పన్ను విధింపు, ఇంజనీరింగ్ విభాగంలో వివిధ వార్డులలో అభివృద్ధి పనుల పురోగతి, నూతన పనులు చేపట్టడం, వీధి దీపాల నిర్వహణ, వన మహోత్సవంలో టార్గెట్ ప్రకారం మొక్కలు నాటడం, సంరక్షించడంపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.